విజిబుల్ పోలీసింగ్‌తో పటిష్ట భద్రత

- నూతన సాంకేతిక పరిజ్ఞానం తప్పనిసరంటున్న పోలీసుశాఖ
- మారుతున్న కాలానికి అనుగుణంగా అత్యాధునిక నిఘా

ఎర్రగుంట్ల : జనాభా పెరుగుదలతో పాటు పట్టణాలు విస్తరిస్తుండటంతో భద్రతా అంశంలో పోలీసులతో పాటు ప్రజలు కూడా తమ సహకారిన్ని అందించాలని పోలీసుశాఖ సూచిస్తోంది. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని పట్టణ ప్రజలు వినియోగించుకోవాలని, అందులో భాగంగా అత్యాధునిక నిఘా నేత్రాలను ఇళ్ల వద్ద, దుకాణాల వద్ద ఏర్పాటు చేసుకోవాలని కోరుతోంది. విజిబుల్ పోలిసింగ్‌తో చోరీలకు, నేరాలకు పాల్పడే వారిని త్వరతగతిన పట్టుకునేందుకు వీలుంటుందని తద్వారా నేరాలను అదుపుచేయవచ్చని భావిస్తోంది. దీంతో జిల్లా పోలీసు ఉన్నతాధికారి ఆదేశాల మేరకు పోలీసులు నిఘా నిమిత్తం నూతనంగా సిద్ధం చేసిన సీసీ కెమెరాల ఆవశ్యకతను ప్రజలకు, దుకాణదారులకు వివరించే ప్రయత్నాలు చేపట్టారు. ఇదివరలో ఉపయోగించిన ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమెరాలు నేరాల నియంత్రణలో సాయపడుతూ వచ్చాయి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నూతన సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా అమర్చబడిన సీసీ టీవీ కెమెరాలు మరింత ప్రభావవంతంగా పనిచేస్తున్నాయని పోలీసులు స్పష్టం చేస్తున్నారు. సాంకేతికతను సరైన విధంగా ఉపయోగించడంలో ప్రజలు తమ ఆస్తులను కాపాడుకోవడంతో ఒక భాగమవుతారు. ప్రజల సహకారం ఉన్నప్పుడే సమాజం భద్రంగా ఉంటుంది. కొంత ఖర్చుతో కూడినదే అయినా భద్రతా పరంగా అది అవసరం కనుక ఏర్పాటు చేసుకోకతప్పదు.

నేర నియంత్రణలో సీసీ కెమెరాలు

ఇటీవల జమ్మలమడుగు, పులివెందుల, కమలాపురం నియోజకవర్గాల్లో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ప్రతిఒక్కరు సీసీకెమెరాలను వినియోగిస్తే అనుమానితులను గుర్తించడంలో, నేర స్థలాలను పర్యవేక్షించడంతో, సాక్ష్యాలను సేకరించడంలో ఇవి ప్రధాన భూమికను పోషిస్తాయి. కెమెరాల ద్వారా పొందిన సాక్ష్యాలు న్యాయ ప్రక్రియలో కీలకంగా ఉంటాయి. ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారిన గుర్తించడంలో పట్టణ ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తుల కదలికలను పర్యవేక్షించడంలో ఇవి ఎంతో సహాయపడతాయి.



ప్రస్తుత సమాజంలో సీసీ కెమెరా నిత్యాసహాయక సాధనమే.

పలు రకాల సీసీ కెమెరాలు..

ఏదో ఒక సీసీ కెమెరాను ఇళ్లకు, దుకాణాలకు అమర్చడంలో ప్రయోజనం ఉండదు. ఎలాంటి కెమెరాలు వాడితే అత్యధిక ప్రయోజనం ఉంటుందో పోలీసులు పలు సూచనలు ఇస్తున్నారు. వారు అందించిన సూచనల మేరకు బయటి వైపు ఉంచే కెమెరాల్లో టీపో క్రిస్టల్ క్లియర్ 2కె క్యూహెచ్‌డీ పరిజ్ఞానం ఉన్న స్మార్ట్ హోమ్ సెక్యూరిటీ కెమెరాలు అమర్చుకోవాలి. ఈ కెమెరాల్లో నైట్ విజన్, మోషన్ డిటెక్షన్, టూవే ఆడియో, స్టోరేజ్ ఆప్షన్, ఎలక్ట్రానిక్ పాస్ సౌకర్యాలు ఉంటాయి. దీంతో నేరస్తులను సులభంగా పట్టుకోవచ్చు.

అలాగే లోపలవైపు ఉంచే కెమెరాల్లో పాన్ సెక్యూరిటీ వైఫై స్మార్ట్ పరిజ్ఞానంలో గానీ, 4జీ సిమ్ ఆధారంగా వైఫైతో పనిచేసే 3ఎంపీ స్మార్ట్ కేమెట్ హైబ్రిడ్ పరిజ్ఞానం గానీ ఉండాలి. ఈ కెమెరాల్లో పాన్‌ఫీచర్, హై రెజల్యూషన్, వైఫై కెనెక్టివిటీ, నైట్ విజన్, టూవే ఆడియో ఉంటుంది. ఇవి దుకాణాలకు ఉపయోగపడుతాయి. ఊరికి దూరంగా వైఫై సదుపాయం లేని ఇళ్లకు సోలార్ 4జి సిమ్, 4ఎంపీపాన్, టిల్ట్‌జూమ్ సదుపాయం ఉన్న సీసీ టీవీ కెమెరాలు వాడాలి. వాటర్ ప్రూఫ్ సౌకర్యం ఉంటుంది. రికార్డింగ్ చేసే అంశాలు స్పష్టంగా ఉంటాయి. జూమ్ సౌకర్యం కూడా ఉంటుంది. ఈ పరిజ్ఞానంతో కార్లలో, బైక్‌లలో కూడా కెమెరాలు వినియోగించకోవచ్చు.



ఆదునిక సీసీ కెమెరాలు

సీసీ కెమెరాలతో పటిష్ట నిఘా..



పోలీసు శాఖ సూచించన కెమెరాలను ఇంటి వద్ద, దుకాణాల వద్ద ఏర్పాటు చేసుకోవాలి. ఇది ప్రజల భద్రతలో ఒక భాగమే అని గుర్తించి ప్రజలు సహకారం అందించాలి. పటిష్ఠ భద్రత కోసం సాంకేతిక పరిజ్ఞానం వాడుకోవాలన్నదే పోలీసు శాఖ ఆలోచన. కెమెరాల ఏర్పాటు కోసం కొంత ఖర్చు చేసినా దాని ప్రయోజనం ఎంతో ఉంటుందని గృహస్తులు, దుకాణదారులు తెలుసుకోవాలి. వాహనాలకు కూడా ఏర్పాటు చేసుకుంటే చోరీ అయ్యే సమయంలో సులభంగా పట్టుకోవచ్చు. కెమెరాల ఏర్పాటులో ఏవైనా సందేహాలు ఉంటే పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సంప్రదిస్తే వివరాలు చెబుతాం. ఆ కెమెరాలన్నీ మార్కెట్‌లో సులభంగానే లభిస్తాయి..

– నరేష్‌బాబు, పట్టణ సీఐ, ఎర్రగుంట్ల

క్లుప్తంగా

అమ్మవారికి విశేష పూజలు



విశేష అలంకారంలో గంగమ్మతల్లి

చింతకొమ్మదిన్నె : మండలంలోని బొగ్గలేటిపల్లి కొత్తపేట సమీపంలోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలతోపాటు అభిషేకాలు నిర్వహించి పట్టు వస్త్రాలతో అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వహణాధికారి పి. సురేష్ కుమార్‌రెడ్డి ఏర్పాట్లను చేశారు. వచ్చిన భక్తులు కానుకలను ముడుపులను సమర్పించుకుని ఆలయ ఆవరణలో బంధుమిత్రులతో భోజనాలు చేశారు. అలాగే ఆలయ ఆవరణంలోని ఆలయాలలో పూజలు నిర్వహించారు.

గ్రావెల్ టిప్పర్ పట్టివేత

పెండ్లిమర్రి : మండలంలోని గొందిపల్లె సమీపంలోని గుట్టల్లో నుంచి అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్‌ను గుర్రాలచింతలపల్లె వద్ద ఆదివారం సాయంత్రం విజిలెన్స్ ఆడిషినల్ ఎస్పీ శ్రీనివాసరావు అదులోకి తీసుకున్నారు. పట్టుబడిన గ్రావెల్ టిప్పర్‌కు పర్మిట్‌లు ఉన్నాయా లేదా అని చెక్ చేశారు. ఎలాంటి పర్మిట్ లేకపోవడంతో వెల్లటూరు వద్ద కాటవేసి ఓవర్ లోడ్ ఉండటంతో టిప్పర్‌ను సీజ్ చేసి పెండ్లిమర్రి పోలీసుస్టేషన్‌లో అప్పగించారు.

నేడు స్వచ్ఛతా హీ సేవపై ర్యాలీ

పులివెందుల టౌన్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం 10 గంటలకు స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాముడు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరామహాల్ రోడ్డు, పూలంగళ్ల సర్కిల్, సెంట్రల్ బోలేవార్డు మీదుగా వైఎస్సార్ సర్కిల్ వరకు ర్యాలీ ఉంటుందన్నారు. అలాగే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పారిశుద్ధ్య కార్మికులకు వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వరద బాధితులకు సామగ్రి పంపిణీ

కడప సెవెన్‌రోడ్స్: విజయవాడ వరద బాధితులకు వస్తు సామగ్రి పంపిణీ చేశామని దూదేకుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఆయిల్ మిల్ ఓబులేసు, రాయలసీమ వర్కింగ్ ప్రెసిడెంట్ ఇదాందుల్లా పేర్కొన్నారు. విజయవాడలోని ముంపు ప్రాంతాలైన పాత రాజరాజేశ్వరిపేట, గొల్లపూడి, బొమ్మసాని సుబ్బారావు నగర్ ప్రాంతాల్లో ఆదివారం వారు పర్యటించారు. అనంతరం బాధితుల ఇబ్బందులను గమనించి దుప్పట్లు, లుంగీలు, టవల్స్, చీరలతో కూడిన సామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎస్ఐ ఖాదరయ్య, టీచర్ అజ్మతుల్లా, మంటపంపల్లి బాషా, పోతుగంటి పేరయ్య పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తా

ప్రొద్దుటూరు కల్చరల్ : ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని అమృతేశ్వరస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు కొవ్వూరు రమేష్‌రెడ్డి తెలిపారు. పెన్నానది తీరంలోని అయ్యప్ప ఆలయంలో ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో అమృతేశ్వరస్వామి ఆలయ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా కొవ్వూరు రమేష్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా నామా రమేష్ బాబు, సభ్యులుగా టంగుటూరు మారుతీ ప్రసాద్, నామా రమేష్ బాబు, కార్యదర్శిగా నామా వాసు, సహాయ కార్యదర్శులుగా వల్లంకొండు రఘు వంశీ, కళాసాగర్, కోశాధికారిగా విజయ్‌లను ఎన్నుకున్నారు. రమేష్‌రెడ్డి మాట్లాడుతూ ఆలయాభివృద్ధి, ఆధ్యాత్మిక చింతన పెంపొందించడానికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. అనంతరం దసరా ఉత్సవాల నిర్వహణపై చర్చించారు.

రఘురామ కృష్ణంరాజుపై కేసు నమోదు చేయాలి

మైదుకూరు : ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని మాలమహానాడు యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు తీట్ల చిట్టిబాబు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ఆ సంఘం నాయకులు బండి పుల్లయ్య, భూమిరెడ్డి చిన్న మాధవయ్యలతో కలసి విలేకరులతో మాట్లాడారు. రఘురామ కృష్ణంరాజు బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీని తొలగించడం శోచనీయమన్నారు. ఆయన బహిరంగంగా క్షమాపణ చెప్పి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రఘురామకృష్ణంరాజు ఒక ప్రజాప్రతినిధిగా సమాజంలో ఉండటం ఎంత మాత్రం శ్రేయస్కరం కాదన్నారు. ఆయన భారత రాజ్యాంగం ద్వారానే ఎన్నికయ్యాడన్న విషయాన్ని మర్చిపోయినట్ట ఉన్నారని మండిపడ్డారు. తక్షణమే ఆయన్ను సస్పెండ్ చేసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

వాహనాల తనిఖీ

పోరుమామిళ్ల : పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో ఆదివారం వాహనాలను సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కొండారెడ్డి తనిఖీ చేశారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

పులివెందుల టౌన్ : పట్టణంలోని బేల్దారి రామాంజి అనారోగ్య కారణంగా ఆదివారం మృతి చెందాడు. అతని దహన సంస్కారాలకు డబ్బులు లేనందున కొంతమంది దాతలు పులివెందుల మేస్త్రి సరితాల ఫక్రుద్దీన్, పులివెందుల నూర్‌బాషా సంఘం అధ్యక్షుడు రసూల్ తరపున రూ.20వేలు ఆర్థిక సాయం అందించారు.

ఇందిరానగర్‌లో నాకాబంది



ఇందిరానగర్ వాసులకు సూచనలు చేస్తున్న పోలీసులు

చింతకొమ్మదిన్నె : కడప నగర సమీపంలోని ఇందిరానగర్‌లో ఆదివారం సీకేదిన్నె పోలీసులు నాకాబంది నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శివశంకర్‌నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి దాదాపు 50 మంది పోలీసు సిబ్బందితో తనిఖీలు చేస్తూ, పాత నేరస్తులను అనుమానాస్పద వ్యక్తులను విచారణ చేశారు. అనంతరం పలు వాహనాల రికార్డులను తనిఖీ చేశారు. రికార్డులులేని ఐదు ఆటోలను, 11 మోటర్ సైకిళ్లను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

లడ్డు ప్రసాదంపై నీచ రాజకీయం

చక్రాయపేట : చంద్రబాబునాయుడు తన చేతకానితనాన్ని కప్పి పుచ్చుకునేందుకు ప్రజలను తప్పుదారి పట్టించేందుకే తిరుమల లడ్డు ప్రసాదంపై నీచ రాజకీయం చేస్తున్నాడని చక్రాయపేట జడ్పీటీసీ సభ్యుడు శివప్రసాదరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎంతో పవిత్రమైన తిరుమల లడ్డూ ప్రసాదాన్ని గొడ్డు మాంసం కొవ్వు కలిపిన నెయ్యి వాడుతున్నారని ముఖ్యమంత్రి హోదాలో అసత్య ప్రచారం చేసిన నీకు ఆ దేవదేవుడే తగినశిక్ష విధిస్తాడన్నారు.

వల్లూరు (చెన్నూరు) : తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంపై జరుగుతున్న వివాదంపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి నేతృత్వంలో సీబీడీతో సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను ప్రజలకు తెలపాలని ఉప్పరపల్లి ఎంపీటీసీ ఎర్రసాని నిరంజన్ రెడ్డి, మాజీ మార్కెట్ డైరెక్టర్ చంద్రఓబుల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. దేశప్రజల మనోభావాలు దెబ్బతీసేలా అధికార పార్టీ వాఖ్యలు చేయడం తగదన్నారు.

రైతు బజార్ త్వరగా తెరవండి

వేంపల్లె : పట్టణంలోని ఓ ప్రైవేటు స్థలంలో ఉన్న కూరగాయల మార్కెట్‌ను తీసివేసి రైతు బజార్‌లోకి మార్చాలని జిల్లా సంయుక్త కలెక్టర్ అదితిసింగ్ ఆదేశాలు ఇవ్వడంపై బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలిహరిప్రసాద్ హర్షం వ్యక్తం చేసి మాట్లాడారు. గత రాష్ట్ర ప్రభుత్వం ఒక కోటి ఇరవై లక్షలు వెచ్చించి రైతు బజార్‌ను నిర్మించిందన్నారు. అయితే ఇక్కడి అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతుబజార్ ప్రారంభానికి నోచుకొక పోవడంతో రైతులతో కలసి రైతు బజార్ ప్రారంభించాలని నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు.

దీనిపై జేసీ కూరగాయల కోసం రైతులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులను విచారించి ఈనెల 20వ తేదీన రైతు బజార్‌ను త్వరితగతిన ప్రారంభించాలని ఆదేశాలు ఇచ్చారన్నారు. స్థానిక పంచాయతీ, మార్కెట్ అధికారులు వెంటనే జేసీ ఆదేశాలను అమలు పరచి రైతు బజార్‌ను వినియోగంలోకి తేవాలని కోరారు.

వేంపల్లెలో ఇసుక దొంగల హల్ చల్

వేంపల్లె : వేంపల్లెలో ఇంటి నిర్మాణం కోసం తోలుకున్న ఇసుకను గుర్తుతెలియని వ్యక్తులు దొంగలిస్తున్నారు. దీంతో ఇంటి యాజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎద్దుల బండ్లు ద్వారా ఇంటి నిర్మాణాల కోసం ఇసుకను యాజమానులు తోలుకుంటున్నారు. దీని ఆసరా చేసుకుని కొందరు రాత్రి సమయంలో ఇంటి వద్ద ఉన్న ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు.

పగలు వచ్చి చూస్తే ఇసుక లేక పోవడంతో కూలీలు వెను తిరగాల్సి వస్తోంది. దీంతో ఇంటి నిర్మాణం చేసుకుంటున్న యాజమానులు భయాందోళనకు గురి అవుతున్నారు. రాయచోటి–పులివెందుల బైపాస్ రోడ్డులో మౌలా అనే వ్యక్తి ఇంటి నిర్మాణం కోసం నాలుగు ట్రాక్టర్ల ఇసుకను తోలించుకున్నాడు. ఇసుకను ఆదివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు పూర్తిగా దొంగలించారు. ఈవిధంగా గతంలో ఎన్నడూ జరగలేదన్నారు. ఇటీవల కాలంలో పాపాఘ్ని నది నుండి ఇసుకను తరలించకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవడం జరిగింది. ఈనేపథ్యంలో ఇంటి ముందు ఉన్న ఇసుకను తరలించేందుకు పాల్పడుతున్నారు. పోలీసులు గస్తీ పెంచి ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పలువురు ఇంటి నిర్మాణ యజమానులు కోరుతున్నారు.

నిరుపయోగంగా ఆర్‌ఆండ్‌బీ బంగ్లా



వినియోగంలో లేకపోవడంతో శిథిలావస్థకు చేరిన ఆర్‌ఆండ్‌బీ భవనం



భవనం చుట్టు పరిధిలో పెరిగిన కంపచెట్లు

ఎర్రగుంట్ల : పట్టణంలో ఉన్న ఆర్‌ఆండ్‌బీ బంగ్లా అభివృద్ధికి నోచుకోక నిరుపయోగంగా ఉంది. కొన్నేళ్లుగా ఈ భవనంను వాడకపోవడంతో విపరీతంగా కంపచెట్లు పెరిగి శిథిలావస్థకు చేరింది. గతంలో ఆర్‌అండ్‌బీ విధులన్నీ ఇక్కడ నుంచి నిర్వహించే వారు. ఇప్పుడు ప్రజాప్రతినిధులు, అధికారులు వస్తే ప్రైవేటు లాడ్జీలు, సిమెంట్ పరిశ్రమలలో ఉన్న అతిథి గృహాలను వాడుకుంటున్నారు. ఇప్పటికైన సంబంధిత శాఖ అధికారులు స్పందించి భవనంను వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు

మహిళల భద్రత పాలకులదే



నూతన కార్యవర్గంతో యూనియన్ నాయకులు

కడప కల్చరల్: మహిళల భద్రతకు.. పాలకులదే బాధ్యత అని ఎల్ఐసీ కడప డివిజన్ జోనల్ ఉపాధ్యక్షురాలు ఎం.కామేశ్వరి అన్నారు. సంస్థ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన శ్రామిక మహిళా సదస్సులో ఆమె మాట్లాడుతూ కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం దారుణమని, రాజకీయాలకతీతంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎల్ఐసీ పరిరక్షణ, సేవల విషయంలో మహిళల భాగస్వామ్యం ప్రశంసనీయమని పేర్కొన్నారు. పాలసీదారులకు మేలు చేసేలా లైఫ్, హెల్త్ బీమా పాలసీల ప్రీమియంపై జీఎస్టీని తొలగిస్తూ కౌన్సిల్ సమావేశం నిర్ణయం తీసుకోవాలని కోరారు. అనంతరం కో కన్వీనర్ వసుప్రద, కన్వీనర్ అమీనా పరీన్ ఆధ్వర్యంలో కడప డివిజన్ శ్రామిక మహిళా కన్వీనర్‌గా వసుప్రద(పి–జీఎస్)ను ఎన్నుకున్నారు. కో కన్వీనర్లుగా శ్రీవాణి(కడప), పద్మ జాలత(కడప), శ్రీకృష్ణ(కడప), హరిప్రియ(నంద్యాల), లత(ఆదోని), శివనందిని(గుంతకల్), లక్ష్మీదేవి(ధర్మవరం)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సత్య శ్రీనివాస్, సుబ్బమ్మ, అరుణ, సునీత, తిరుపతయ్య, శ్రీనివాసన్, అవధానం శ్రీనివాస్, రఘునాథరెడ్డి తదితరులు మాట్లాడారు.

డీఎంఏ డీడీగా వైఓ నందన్

కడప కార్పొరేషన్: గ్రేడ్–1 మున్సిపల్ కమిషనర్ వైఓ నందన్‌ను డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌లో డిప్యూటీ డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అనిల్‌కుమార్ సింఘాల్ ఉత్తర్వులు జారీ చేశారు. కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా) వైస్ ఛైర్మెన్‌గా ఉన్న ఆయనకు ప్రభుత్వం కడప మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా ఇటీవల పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. కొన్ని రోజులకే కుడా వైస్ ఛైర్మెన్‌గా బదిలీ చేసి సీడీఎంఏలో రిపోర్టు చేసుకోవాలని ఆదేశించారు. విజయవాడలో వరదలు రావడంతో ఆయన కడప నగరపాలక సంస్థ తరఫున బాధితులను ఆదుకునేందుకు తన వంతు కృషి చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వైఓ నందన్‌ను డీఎంఏ డీడీగా బదిలీ చేస్తూ ఉత్తర్వులివ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది.

టెర్రస్ గార్డెన్‌తో ఆరోగ్యకరమైన జీవనం



మొక్క అందజేస్తున్న సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్ సభ్యులు

కడప కల్చరల్: టెర్రస్ గార్డెన్‌తో ఆరోగ్యకరమైన జీవనం సాధ్యమవుతుందని సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్ సభ్యులు సూష్మ, అలేఖ్య, కిరణ్, సుప్రియ పేర్కొన్నారు. కడప ఓం శాంతి నగర్‌లో ఆదివారం సీటీజీ సభ్యుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఇంటిపై సేంద్రియ ఆరోగ్యవంతమైన గార్డెన్ ఏర్పాటు సంతోషకరమన్నారు. పట్టణాల్లో నివసిస్తున్న వారిలో ప్రత్యేకమైన సేంద్రీయ ఆహార వ్యవసాయాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో టెర్రాస్ గార్డెన్‌ను విస్తృతం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం సేంద్రియ పెంపకానికి సంబంధించి పలు రకాల కూరగాయలు, పండ్లు, పూల మొక్కలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో 60 మంది సభ్యులు పాల్గొన్నారు.

టీటీడీలో అవినీతిపై సీబీఐ విచారణ చేపట్టాలి

వైవీయూ: టీటీడీలో జరిగిన అవినీతి, అక్రమాలపై సీబీఐ విచారణ చేపట్టాలని రెవల్యూషనరీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి కోరారు. కడప నగరంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ ప్రసిద్ధ సంస్థ టీటీడీలో గతంలో జరిగిన అవకతకలపై పూర్తి స్థాయి విచారణ చేపట్టి టీటీడీ పవిత్రతను దెబ్బతీసే వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో ప్రశాంత్, హరిబాబు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలిపై చర్యలు తీసుకోవాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: బద్వేల్ పట్టణంలోని బాలికోన్నత పాఠశాల విద్యార్థిని మహిమను కొట్టిన ఉపాధ్యాయురాలిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి అన్నారు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థిని ఆయన ఆదివారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర సభ్యులు రాజేష్, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా దసరా ఏర్పాట్లు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయంలో దసరా ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. అక్టోబర్ 3వ తేదీ నుంచి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానుండడంతో చలువ పందిళ్లు, ఆలయంలో సెట్టింగ్‌లు చేయడంతోపాటు శుభ్రపరుస్తున్నారు. పలు ప్రాంతాల కార్మికులు ఈ పనుల్లో నిమగ్న మయ్యారు. ఆర్య వైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రాంమోహన్‌రావు, ప్రతినిధులు సమావేశం నిర్వహించి పర్యవేక్షిస్తున్నారు.

ఎన్‌హెచ్‌పై అక్రమంగా వేలసిన షెడ్లు

- స్థానిక టీడీపీ కార్యకర్త అండతో వేస్తున్న షెడ్లు
- న్యాయం చేయాలంటున్న బాధితులు



తాళ్లప్రొద్దుటూరులో అక్రమంగా వెలసిన షెడ్లు దగ్గర బాధితులు

కొండాపురం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకునే కూటమి నేతల అగడాలకు అధికారులు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. వివరాల్లోకి వెళ్లితే.. మండలంలోని తాళ్లప్రొద్దుటూరులో నూతనంగా నాలుగు వరుసల జాతీయ రహదారి నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈ రహదారి పక్కన నూకల భారతికి చెందిన కె.సుగుమంచిపల్లె రెవెన్యూలో సర్వేనెంబర్ 316–2 బి3లో 16 సెంట్లు స్థలం ఎన్‌హెచ్‌కు ఎదురుగా ఉంది. ఈ జాతీయ రహదారి రోడ్డు నిర్మణంలో భాగంగా ఎత్తు పెరగడంతో తన స్థలంలో రూ. లక్ష ఖర్చు పెట్టి గ్రావెల్ తోలించుకున్నారు. మా స్థలం ఎదురుగా ఎన్‌హెచ్ రోడ్డులో స్థానిక టీడీపీ కార్యకర్త అండతో కొందరు దుఖాణదారులు షెడ్లు నిర్మిస్తున్నారు. నా స్థలం ఎదురుగా ఎందుకు నిర్మిస్తున్నారు అన్ని ప్రశ్నించగా ఎవరికైనా చెప్పుకో అని సమదానం చెప్పారన్నారు. అధికారుల చుట్టు ప్రదక్షిణలు చేస్తున్నా ఫలితం లేదన్నారు. ఈవిషయంపై ఎన్‌హెచ్ ఎఈ దీపక్‌రెడ్డిని సాక్షి వివరణ కోరగా ఎన్ హెచ్ రోడ్డుకు ఇరువైపులా అక్రమ షెడ్లు వేసిన వారికి రెండు రోజుల్లో నోటీసులు ఇచ్చి తొలగిస్తామన్నారు.

కంపచెట్లను తొలగించండి



రోడ్డుకిరువైపులా పెరిగిన కంపచెట్లు

సింహాద్రిపురం : మండలంలోని గ్రామాలకు వెళ్లే లింకు రోడ్లకు ఇరువైపులా కంపచెట్లు పెరగడంతో ఎదురు వచ్చే వాహనాలు కనపడక ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానిక ప్రజలు వాపోతున్నారు. కోరగుంటపల్లె–లోమడకు వెళ్లే రోడ్డులో ఏపుగా కంపచెట్లు పెరగడంతో రెండు వారాల క్రితం సచివాలయ మహిళా పోలీసు ప్రమాదం బారిన పడింది. గతంలో వృద్ధురాలిని వాహనం ఢీ కొనడంతో కాలు విరిగింది. రోడ్లకిరువైపులా ఉన్న కంపచెట్లు ఇలా ప్రమాదాలకు నిలయంగా మారాయని ప్రజలు, వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఆర్‌అండ్‌బీ రోడ్డులో గుంతలు పూడ్చడంతో పాటు రోడ్డుకిఇరువైపులా ఉన్న కంపచెట్లను తొలగించి ప్రమాదాలు జరగకుండా చూడాలని వారు కోరుతున్నారు.

విద్యుత్ స్తంభాలను తొలగించండి



విద్యుత్ స్తంభాలను చూపిస్తున్న బాధితుడు అయ్యావార్‌రెడ్డి

పులివెందుల రూరల్ : పట్టణంలోని వెలమవారిపల్లె రోడ్డు సమీపంలోని సబ్‌స్టేషన్ వద్ద అయ్యావార్‌రెడ్డి, దస్తగిరిలకు సర్వేనెంబర్ 14, 15లో మేములేని సమయంలో విద్యుత్ అధికారులు పక్కనే ఉన్న స్థలం వారు కలిసి మాస్థలంలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనేక మార్లు విద్యుత్ అధికారులను అడిగినా పట్టించుకోలేదని వారు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఇప్పటికైనా మాస్థలంలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలను తొలంగించాలని వారు కోరుతున్నాం. లేకపోతే విద్యుత్ కార్యాలయంకు వచ్చి ఆత్మహత్య చేసుకుంటామంటున్నారు.

బదిలీలలో న్యాయం జరగలేదు

కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీఎస్సార్టీసీ కడప జోన్, రీజియన్ పరిధిలో జరిగిన బదిలీల్లో ఏ సెక్షన్‌కు న్యాయం జరగలేదని కార్మిక పరిషత్ జోనల్ కార్యదర్శి పురుషోత్తం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ బదిలీల్లో నిబంధనలు గాలికి వదిలేశారన్నారు. కొన్ని విభాగాల్లో ఉన్న ఖాళీలకు బదిలీ చేయాలని కోరినా పట్టించుకోలేదన్నారు. ఈడీ సమీక్షించి ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు.

ఆర్టీసీలో ఏకపక్ష బదిలీలు

కడప కోటిరెడ్డి సర్కిల్: ఏపీఎస్సార్టీసీ కడప జోన్–4, కడప రీజియన్ వ్యాప్తంగా ఈ నెల 21న జరిగిన బదిలీల్లో అధికారులు ఏక పక్షంగా వ్యవహరించారని ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ఎ.ఆర్.మూర్తి, రాము తెలిపారు. విలేకరులతో వారు మాట్లాడుతూ అధికారులు జీవో ప్రకారం ఐదేళ్లు పూర్తి చేసిన ఉద్యోగి కోరితే బదిలీ చేయాలనే నిబంధన బేఖాతరు చేశారని తెలిపారు. తాము అనుకున్న వారిని బదిలీ చేశారని, కొన్ని సెక్షన్లలో వెళ్లాలనుకున్న ఉద్యోగులకు అన్యాయం జరిగిందన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పులివెందులలో ఒకేవేదికపై కలుసుకున్న పూర్వపు విద్యార్థులు



కొండాపురం : గురువులతో పూర్వ విద్యార్థులు

పులివెందుల రూరల్ : మండల పరిధి నల్లపురెడ్డిపల్లెలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఆదివారం 1984–85 సంవత్సరంలో 10 తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒకే వేదికపైకి వచ్చి ఇలా కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా చదువు చెప్పిన గురువులను వారు సన్మానించి మాట్లాడారు. పిల్లలకు చదువు చెప్పడంలో గురువులు ఎంతో శ్రద్ధ తీసుకుంటారన్నారు. విద్యార్థులు ఎంత ఎత్తుకు ఎదిగిన గురువులను, తల్లి దండ్రులను గౌరవించాలన్నారు.

కొండాపురం : మండలంలోని తాళ్లప్రొద్దుటూరు జెడ్పీ ఉన్నతపాఠశాలలో 1983–1984 బ్యాచ్ పదవ తరగతి చదివిన విద్యార్థులు ఆత్మీయసమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం సాయి పంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఈశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. వివిధ స్థాయిలో ఉన్నతశిఖరాల్లో స్థిరపడిన ప్రతి ఒక్కరు సమాజంలో ప్రజలకు సేవ చేయాలన్నారు. ఒకచోట సమావేశమై ఆప్యాయంగా పలకరించుకుంటు యోగక్షమాలు తెలుసుకున్నారు. చదువుచెప్పిన విశ్రాంత ఉపాధ్యాయులు ఈశ్వర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డిలను పూర్వ విద్యార్థులు శన్మానించారు.